పొన్నూరు.. నిషా జోరు

యథేచ్ఛగా గంజాయి వ్యాపారం



పట్టణంలో ఇటీవల పట్టుబడిన గంజాయి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్)

పొన్నూరు: పొన్నూరు కేంద్రంగా గంజాయి వ్యాపారం జోరుగా సాగుతున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. బాపట్ల, గుంటూరు జిల్లాలకు నడి మధ్య ప్రాంతం కావడంతో నలువైపులా రవాణాకు అవకాశం ఉంటోంది. దీన్ని ఆసరాగా తీసుకుని ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెప్పించి ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలు, స్థానికంగా యువతకు అమ్మకాలు సాగించే ముఠాను ఇటీవల పొన్నూరు పట్టణ పోలీసులు నిఘాపెట్టి అరెస్టు చేశారు. వారి నుంచి 1500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. పట్టణానికి చెందిన 13 మందికి పైగా గంజాయి కేసులో ఉండటం చర్చనీయాంశమైంది. వారిలో ఐదుగురు గంజాయి అమ్మకాలు చేస్తుంటే, 8 మంది యువకులు గంజాయి తాగుతూ పట్టుబడటం చూస్తే ఏ స్థాయిలో గంజాయి రవాణా అవుతుందో అర్థం చేసుకోవచ్చు. గతంలో కూడా సుమారు 4 కిలోల గంజాయి పట్టుబడిన సంఘటనలు జరిగాయి. పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొన్నూరు కేంద్రంగా గంజాయి విచ్చలవిడిగా విస్తరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

జోరుగా గంజాయి వ్యాపారం

కూటమి పాలనలో పొన్నూరు కేంద్రంగా గంజాయి వ్యాపారం జోరందుకుంది. యువతకు సులభంగా గంజాయి ప్యాకెట్లు దొరుకుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 5 గ్రాముల గంజాయి ప్యాకెట్లని రూ. 500లకు విక్రయిస్తున్నారు. మత్తుకు అలవాటు పడిన యువత దానికి బానిసలుగా మారుతున్నారు. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు. నేరుగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగుతున్నారంటే ఎంత సులభంగా వ్యాపారం సాగుతుందో గ్రహించవచ్చు. పట్టణంలోని ఇటికంపాడు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాలు గంజాయి అమ్మకాలకు అడ్డాలుగా మారిపోయాయి.

రాత్రి ఏడు దాటిందంటే చాలు..

పొన్నూరులోని రైల్వేస్టేషను ప్రాంతం, ఇటికంపాడు రోడ్డు శివారు ప్రాంతంలో రాత్రి ఏడు గంటలు దాటిందంటే మందుబాబులు, గంజాయి తాగే వారే ఎక్కువగా కనిపిస్తుంటారు. పొన్నూరు నుంచి ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలించి విక్రయిస్తున్నారు. వాటిని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు, పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. అధికారులు స్పందించి గంజాయి అమ్మకాలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

చదువు-క్రీడలతోనే పేరు ప్రఖ్యాతలు



వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: చదువు వల్ల మనిషి విలువ ఎంత పెరుగుతుందో క్రీడల వల్ల కూడా అంతే పేరు ప్రఖ్యాతులు, హోదా, మంచి ఉద్యోగాలు వస్తాయని విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి తెలిపారు. మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఉన్నత విద్య ప్రవేశాల్లో, ఉద్యోగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించటం వల్ల క్రీడాకారులకు అనేక అవకాశాలు లభిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు, ఆరోగ్యం గురించి తెలిపారు. విశ్రాంత అధ్యాపకుడు వీర గంగాధరరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలంటే మెరుగైన సౌకర్యాలు ఉండాలని, అందుకు అవసరమైన ఆట స్థలం మా వంశస్తులు పాఠశాలకు అందించారని, విద్యార్థులు దాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సుమేథ హైస్కూలు డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్య వినయం, విజ్ఞానం నేర్పితే క్రీడలు క్రమశిక్షణ నేర్పుతుందన్నారు. మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కూడా కలుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుర్రా సాంబిరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు స్టాఫ్ సెక్రటరీ హనుమంతరావు, శ్రీనివాసరావు, చంద్రమౌళి, శాంతిప్రియ, శివపార్వతి, అరుణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి

ప్రతి ఒక్కరూ తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలని విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాష లేనిదే బతుకు లేదని, ఎవరి మధ్య సంభాషణ జరగాలన్నా భాష ఒక్కటే ఆధారమన్నారు. మన మాతృభాష తెలుగుని కాపాడుకుకోవాల్సిన అవసరం, బాధ్యత మన అందరిదని తెలుగు ఉపాధ్యాయుడు చంద్రమౌళి చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవగిరి వీరగంగాధరరెడ్డి, కుర్రా సాంబిరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు స్టాఫ్ సెక్రటరీ హనుమంతరావు, శ్రీనివాసరావు, చంద్రమౌళి, శాంతిప్రియ, శివపార్వతి, అరుణ, ధర్మరాజు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో జాతీయ క్రీడా దినోత్సవం



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు రోడ్డులోగల విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక మాట్లాడుతూ జెఎన్‌టీయూ కాకినాడ సౌత్ జోన్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టీంలకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాలలో పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. పోటీలలో ఎంపికైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసినట్లు కళాశాల పీడీ డైరెక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. ఫిటినెస్ ట్రైనర్ కందిమళ్ళ స్వప్న విద్యార్థినులకు ఫిటినెస్‌పై అవగాహన కల్పించారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోటీలకు ..

భవిష్యత్ సాంకేతికతలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముందంజలో నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి క్వాంటమ్ వ్యాలీని ప్రారంభించారని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎస్‌సీహెచ్‌ఈ సంయుక్తంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025ను నిర్వహిస్తున్నాయన్నారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరులోని విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు నిర్వహించారని తెలిపారు. పోటీలలో మొత్తం 30 మంది విద్యార్థినులు వివిధ విభాగాల నుండి చురుకుగా పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత



వెనిగండ్లలో ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని సన్నివేశాలు

పెదకాకాని: కళలను ఆదరించి కళాకారులను పోత్సహించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా బావించాలని వీరభద్ర సాంస్కృతిక కళా సమితి వ్యవస్థాపకుడు, వెండి కిరీటధారి ఉల్లంగుల బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామదేవత నాంచారమ్మ అమ్మవారి ఆలయం వద్ద, వినాయకుని పందిరి ప్రాంగణంలో శుక్రవారం రాత్రి గయోపాఖ్యానం వార్‌సీను, సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకము ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి వారి సౌజన్యంతో శ్రీతారకరామ కళాప్రవంతి వెనిగండ్ల వారి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉల్లంగుల బ్రహ్మయ్య మాట్లాడుతూ నేటి ఒత్తిడితో కూడిన నిత్య జీవనంలో ప్రతి ఒక్కరిలో ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం నింపేదుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహనీయుల చరిత్రలను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ అంతరించి పోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఈ నాటక ప్రదర్శనల్లో కళాకారులు గుర్రపుశాల శ్రీనివాసరావు, ఉల్లంగుల బ్రహ్మయ్య, షేక్ చినలాలు, దుర్గం వెంకటేశ్వర్లు, విక్టరీ ఎం మరిబాబు, వరికల్లు సుబ్బారావు, రావెల కోటేశ్వరరావు, పీటా వెంకటేశ్వర్లు, కురునూతల బుల్లయ్య, ఖాసింపీరా, పాటిబండ్ల మంత్రయ్య, శాంతి, బి రత్నజలు అద్భుతంగా ప్రదర్శించారు. తమ గానామృతంలో పౌరాణిక నాటక ప్రియులను ఉర్రూతలూగించారు. అనంతరం పలువురు స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించారు.

ఏఎన్‌యూలో తెలుగు భాషా దినోత్సవం



జయంతి వేడుకల్లో పాల్గొన్న వీసీ ఆచార్య కె గంధాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రాచ్యభాషా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషాదినోత్సవ సభాకార్యక్రమం నిర్వహించారు. ఈ సభ కార్యక్రమానికి విభాగాధ్యక్షులు డాక్టర్ ఎస్‌వీ కృష్ణారావు మాట్లాడుతూ వ్యావహారిక భాషోద్యమ పితామహుడైన గిడుగు వేంకట రామమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని మన మాతృభాష అయినటు వంటి తెలుగు భాషాదినోత్సవాన్ని ప్రతి యేటా జరుపుకోవడం' 2 సత్సంప్రదాయంగా వస్తుందన్నారు. తెలుగుభాషకై గిడుగువారు పడిన శ్రమను తెలియజేసే కార్యక్రమానికి ముఖ్య అతిధి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు విచ్చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ గిడుగువారి జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. నేటి యువత గిడుగు చూపిన మార్గంలో పయనించి తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన రెక్టార్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ తెలుగు భాష అజరామరంగా వెలుగొందటానికి కారకులైన గిడుగువారి సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆచార్య ఆత్మీయ అతిథి రిజిస్ట్రార్ సింహచలం మాట్లాడుతూ గ్రాంధిక భాష అతి కఠినమైనదని, ఆ భాషను సామాన్యులు మాట్లాడుకునేలా వాడుక భాషకు పట్టం కట్టిన మహనీయుడు గిడుగు వెంకటరామ్మూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య పి.వరప్రసాదమూర్తి పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు పరిశోధనల్లో భాగస్వామ్యం కావాలి



వైద్య విద్యార్థులతో డాక్టర్ పి.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

గుంటూరు మెడికల్: వైద్యులుగా వృత్తి పరమైన ప్రగతికి తీరకలేకుండా మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం, పరిశోధనల్లో భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్ర శేఖర్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెంలో కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. వైద్య విద్యార్థులు, అధ్యాపకులతో సాధారణ సమావేశమై పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల సంఖ్య దష్ట్యా మానసిక ఆరోగ్యం ప్రోత్సాహం అత్యంత అవసరమని తెలిపారు. ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడేందుకు సంవత్సరానికి కనీసం ఒకసారి వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ముఖ్యంగా ఎంబీబీఎస్ పార్ట్ 1, పార్ట్ 2 విద్యార్థులు ఎదుర్కొంటున్న సిలబస్ సంబంధిత ఇబ్బందులు, పార్ట్ 2 విద్యార్థులపై అధికమైన సబ్జెక్టుల భారం గురించి ప్రస్తావించారు. అలాగే అన్ని అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు నిరంతర హాజరును పాటించాలని సూచించారు. సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ మోహన్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ అంజయ్య, బోధనా సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో తెలుగు భాషా దినోత్సవం



పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకాని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ సీబీఎస్‌ఈలో శుక్రవారం ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా టీజేపీఎస్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ అన్నదానం అంజనీకుమార్ విచ్చేసి తెలుగు భాష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ సిస్టర్ సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి తెలుగుభాష తల్లి లాంటిదని తెలుగుని మరచితే మన తల్లిని మరిచిపోయినట్టేనని తెలుగు భాష పై పట్టు సాధిస్తే ప్రపంచంలోని అన్ని భాషలు అత్యంత సులభంగా నేర్చుకోవచ్చని తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు డ్రాయింగ్ వ్యక్తిత్వం వ్యాసరచన రకరకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని కలసిన అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: తాడేపల్లిలో రాజ్యసభ సభ్యులు వై.వీ.సుబ్బారెడ్డిని శుక్రవారం వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొండవీటి వాగు కట్టలు తెగి పొన్నూరులో రైతులకు జరిగిన నష్టాన్ని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఎరువులు అందక వారు పడుతున్న ఇబ్బందులను మురళీకృష్ణ తెలియజేశారు.

కళ్ళం కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని కళ్ళం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమా శంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుడి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న తాతా వెంకటేశ్వర్లుకు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసిందన్నారు. కార్డియో వాస్క్యులర్ డిసీజ్ ప్రిడిక్షన్ ఇంటిగ్రేటెడ్ క్రిటికల్ డేటా అండ్ మెషిన్ లెర్నింగ్ అప్రోచెస్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. పరిశోధనకు డాక్టర్ ఆర్ భవానీ, డాక్టర్ ఎస్ శ్రీనివాస శర్మలు పర్యవేక్షణ భాధ్యత నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యాపకులు డాక్టర్ పీఎల్ మాధవరావు తదితరులు అభినందించారు.

ప్రాడిజీ విద్యాలయంలో క్రీడా దినోత్సవ వేడుకలు



గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడు గ్రామంలోగల ప్రాడిజీ విద్యాలయంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు బాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ గిడుగు వెంకటరామమూర్తి జీవిత విశేషాలను, తెలుగు బాషకు ఆయన చేసిన సేవలను వివరించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు, నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.సూర్యకుమారి, ప్రిన్సిపల్ వై.రధినిచౌదరి పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో ఎస్పీ

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన 99 అడుగుల మట్టి విగ్రహానికి భక్తుల నుంచి మంచి స్పందన వస్తుంది. శుక్రవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ 99 అడుగుల మట్టి విగ్రహాన్ని సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీని ప్రత్యేక ఆహ్వానంతో పూజారులు స్వామి వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 99 అడుగుల మట్టి విగ్రహాన్ని గుంటూరులో ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పెట్టిన ఈ మట్టి విగ్రహాన్ని అందరూ వీక్షించాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నరేంద్ర, వైస్ చైర్మన్ రాజా నాయుడు, సెక్రటరీ లక్ష్మారెడ్డి, జాకీర్, హేమంత్, కళ్యాణ్ రామాంజిరెడ్డి, గణేష్, గంటా స్వామి, దుర్గారెడ్డి కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్‌లో ప్రతిభ చూపిన మలినేని విద్యార్థులు



గుంటూరు రూరల్: విద్యార్థుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుంనది మలినేని లక్ష్మయ్య మహిళల ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మలేషియాలోని యూకెఎమ్ యూనివర్శిటీలో జరిగిన ఐఈఈఈ ఎసిస్ట్ 12-2025 ఇన్నోవేషన్ చాలెంజ్ ట్రాక్ కార్యక్రమంలో తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు దేవిరెడ్డి నాగజ్యోతి, దావులూరి హరి కాచౌదరి, అక్కు శివపార్వతిలు పాల్గొన్నారు.

తెలుగును ప్రజలభాషగా మార్చిన గిడుగు



పొన్నూరు: తెలుగును ప్రజల భాషగా మార్చిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులని దొప్పలపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జ్యోతిర్మయి అన్నారు. శుక్రవారం గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా హైస్కూల్‌లో తెలుగు భాషాదినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ గ్రాంధికంలో సాగిన తెలుగును అతి సామాన్య జన వాడుకభాషలోకి మార్చిన ఘనత గిడుగు వారికి దక్కుతుందన్నారు. తెలుగు పండిట్ రాచకొండ విజయకుమారి మాట్లాడుతూ గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమ ఫలితంగానే కొందరికి మాత్రమే పరిమితమైన తెలుగు భాష వాడుక భాషగా రూపొందన్నారు. అతి సామాన్యుడికి కుడా తెలుగు భాషను అందించిన గిడుగు వారు చిరస్మరణీయులు అన్నారు. ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షులు జి. శాంతమూర్తి మాట్లాడుతూ మాతృభూమిని మాతృభాషను మరువకూడదన్నారు. పరభాషను గౌరవించి మనభాషను ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. అనంతరం హెచ్‌ఎం జ్యోతిర్మయిని ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శంకరరావు, విజయలక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలలో ఘనంగా సంగమం ఉత్సవాలు



విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోగల చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం చిప్సోయిరీ 2025 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విద్యాధర మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా 25 ఫార్మసీ కళాశాలలు పాల్గొన్నాయన్నారు. ఆగస్టు 24న నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు క్యారమ్స్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, పాటలు, ఏకపాత్రాభినయం, అంత్యాక్షరి, డంబ్ చరేడ్స్ వంటి సాంస్కృతిక పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. విజేతలకు అతిథుల చేతులమీదుగా నగదు బహుమతులు అందజేశారు. పోటీలలో హిందూ ఫార్మసీ కళాశాలకు ప్రథమ బహుమతిగారూ 10,000, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు ద్వితీయ బహుమతిగారూ 5,000 నగదు బహుమతులు అందజేయటం జరిగిందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి సింహాచలం, కృష్ణ యూనివర్సిటీ (మచిలీపట్నం) ఇంచార్జ్ రెక్టర్ ప్రొఫెసర్ ఎంవి. భసవేశ్వరరావులు మాట్లాడుతూ ఆగస్టు 29న జరుపుకునే జాతీయ క్రీడా దినోత్సవం భారత హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా జరుపుకుంటారని చెప్పారు. ఈ దినోత్సవాన్ని చిప్స్ కళాశాలలో ప్రతి సంవత్సరం జరుపుకోవడం సంతోషకరమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ధైర్యానికి తోడ్పడతాయన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జన్మదినోత్సవాన్ని స్మరించుకుంటూ నిర్వహించే తెలుగు భాషా దినోత్సవం కూడా ఇదే రోజు జరుపుకోవడం ఎంతో ఉత్సాహాన్ని కలిగించిందన్నారు. చిప్స్ కళాశాల గత పదేళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తూ విద్యా, క్రీడా, భాషా రంగాల్లో విశిష్టతను చాటుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సిఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణ, విజేతలను అభినందించారు.

పరిశోధనల వైపు దృష్టి పెట్టాలి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సాంకేతిక ఆవిష్కరణలలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని, స్టార్టప్‌ల నెలకొల్పేందుకు డేటా టెక్నాలజీ ప్రధాన వనరులుగా మారాయని, ఔషధ పరిశోధన, అభివృద్ధిలో మనదేశం నూతన శిఖరాలను అధిరోహిస్తోందని సీఐఐ విజయవాడ జోన్ చైర్ పర్సన్ డాక్టర్ వి.నాగలక్ష్మి, వైస్ చైర్మన్ అభినవ్ కోటగిరిలు తెలిపారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ది ఎవాల్వింగ్ ల్యాండ్ స్కేప్ అఫ్ ఇండియన్ ఇన్నోవేషన్ ఇన్ ఫార్మాస్యూటికల్, అండ్ టెక్-పవర్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, 'స్కేలింగ్ స్టార్టప్ విత్ డేటా అండ్ డైవర్సిటీ' అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్ కార్యక్రమానికి వారు అతిధులుగా పాల్గొన్నారు. ఇరువురు మాట్లాడుతూ ఔషధ రంగంలో జరుగుతున్న తాజా పరిశోధనలను, నూతన స్టార్టప్‌ల స్థాపనలో డేటా అనలిటిక్స్, టెక్నాలజీ, వైవిధ్యమైన ఆలోచనల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. భారత దేశ పరిశోధనా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వ రంగాలు, ప్రైవేట్ సంస్థల సంయుక్త సహకారంతో పాటూ విద్యార్థుల భాగస్వామ్యం అవసరమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు.

ప్రస్తుతం అంతర్జాతీయ పరిశోధన సంస్థలు విదేశీ కంపెనీలతో భారత ఫార్మా కంపెనీలు భాగస్వామ్యాలు కుదుర్చుకుంటున్నాయన్నారు. దీనితో ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం భారతదేశానికి వస్తున్నాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, డాక్టర్ కె.స్వర్ణశ్రీ, డాక్టర్ ఎస్.రాధిక, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో జాతీయ క్రీడా దినోత్సవం



క్రీడా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ఆరోగ్యం, పోటీతత్వం, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పీడీ జి బాలశౌరిరెడ్డి, ఎన్‌సీసీ అసోసియేట్ లెఫ్టినెంట్ కె సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బాషా దినోత్సవం

గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య మాట్లాడుతూ తెలుగు బాష ప్రాముఖ్యతను వివరించారు. బ్రహ్మశ్రీ మయ్యూరు సుందరం, డాక్టర్ భవన్నారాయణలు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, కవితలు, తదితరాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆర్ షారోన్‌రోజ్, అధ్యాపకులు ఆర్ ఫణిరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఆవుల వరలక్ష్మి W/o ఆవుల హరి ప్రసాదరావు, గుంటూరు జిల్లా, పొన్నూరు (మం), మాచవరం గ్రామ వాస్తవ్యులకు చెందిన పొలం దస్తావేజు నెం. 572/1995 గల ఒరిజినల్ దస్తావేజులు తీసుకుని 25-08-2025 తేదిన మాచవరం గ్రామంలో పొన్నూరు వెళ్ళేందుకు ఆటో ఎక్కే క్రమంలో జారిపోయినది. దొరికినవారు సంప్ర: 9493763536

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, చింతలపూడి గ్రామ కాపురస్థురాలు (లేటు) కటికల విజయభాస్కరరావు గారి భార్య విజయ రాచెల్ [illegible] తెలియ చేయునది ఏమనగా, ది.30-01-2023 న మా అత్తగారైన కటికల [illegible], భర్త ఏసుదాసు గారు చింతలపూడి గ్రామ సర్వే నెం.350-1లో [illegible] సెంట్లు, సర్వే నెం.[illegible] లో [illegible] స్థలమును [illegible] నా భర్తగారైన కటికల విజయభాస్కరరావు, తండ్రి ఏసుదాసు గారి పేరిట [illegible] దస్తావేజు నెం. 152/2010 [illegible] ది.25-06-2024న [illegible] దస్తావేజు [illegible] కాపీలు [illegible] పొన్నూరు పట్టణమునకు [illegible] పొన్నూరు [illegible] దస్తావేజు [illegible] పోయినది. [illegible] దస్తావేజు [illegible] లేదు. [illegible] దస్తావేజు ఎవరికైనను దొరికిన యెడల [illegible] తెలియపర్చ గలరని కోరుచున్నాను.

కటికల విజయరాచెల్

సెల్ నెం : 7[illegible]

చింతలపూడి. [illegible]-2025